"బాబా! మేమూకాదు మా తలపాగాలుకాదు, ఇదంతా బగమంతుడి మాయ! మాయ కాకపోతే మరేంటి? మీరు ఎక్కి అంతసేపూ మెయిలు నిలబడ్డ మేమిటి? నేను దిగేలో "దిగొద్దు! బండి కదుల్తూవుంది అని గార్డుదొర అనడమేటి? యిడ్డూరంగా వుంది నేటిపొద్దు! తమరు మా దొడ్డమారాజులు మరో రెండణాలు ఇప్పించండి!" అన్నాడు ఒక కూలి బండిలో వుండిపోయి. "నీవు ఎక్కడ దిగుతావు మరి?" అన్నాడు ప్రయాణీకుడు రెండణాలు వానిచేతపడేస్తూ, వానివైపు చూస్తూ.

"అంతా బగమంతుడిమాయ చూస్తూవుండండి! ఎక్కడ దిగుతానో!" అని అల్లా మెల్లిగా దిగాడు కూలీ! బండి వేగం తగ్గించగా సుందరరావు అన్నాడు "ఇదంతా కూలీల్లోవుంది" అని తెనుగు భాషను. ఆ భాషరానివాళ్లు తలలు త్రిప్పారు. "ఎవరిలో మాయవుంటేం! మెయి లందుకున్నాం!" అన్నారు క్రొత్తప్రయాణీకులు నిశ్చింతగా!

... ... ... ... ...

## మీకు తెలియదండీ?

ప్రకాశం "నాన్నగారూ! ఆకాశం మీదనుంచి మొన్న మన పెరట్లో పడ్డ వడగ గట్టిగావుండి నోట్లో పెట్టుకుంటే జిల్లుమంది. అంతలో కరిగిపోయింది. ఇదేమిటండీ! సముద్రములోనుంచి వచ్చిపడిన ఈ వడగ ఇలా మెత్తగావుంది! తుప్ తుప్" మని అన్నాడు చేతిలో ఒక మెత్తనిపదార్థం పెట్టుకు.

ప్రకాశం ముఖంకేసి చేతికేసి అలా చూచాడు వాళ్ళనాన్న! "ఓరేవ్! దాన్ని నోట్లో పెట్టుకున్నావా? ఏమిట్రా? చెప్పరా? అది వడగకాదురా! దానిని తినరురా! చెప్పరా పెద్దవాళ్లతో చెప్ప కుండా కొత్తవస్తువ ఏదీ కుర్రవాళ్ళు తినగూడదురా! ఏదిపడితే అది తినేసెయ్యడమే?" అని అన్నాడుకూడాను కోపంగా.

ప్రకాశం ముగ్ధుడై సముద్రంకేసిచూస్తూ విస్తుపోతున్నాడు ఇంకాను. ఒరేవ్! అటేముందని చూస్తున్నావు మళ్ళీని?" అని కసిరాడు వాళ్ళనాన్న. ప్రకాశం అలా తన చేతిలోనుంచి ఆ తెల్లని పదార్థాన్ని ఇసకమీదకు జారవిడుస్తూ పరుగెత్తుకువెళ్లి సముద్రం లోంచి పురిషెడు ఉప్పునీళ్ళు పట్టుకొస్తూ "ఇవే నేను వుప్పగా నున్నాయన్నది. అదికాదు" అన్నాడు నోరు తుడుచుకుంటూ. తండ్రి "తెలిసిందా ఇప్పుడు సముద్రపు రుచి? రా! ఇలాకూచో తెల్లనిపదార్థాన్ని గురించి పాఠం చెబుతాను" అన్నాడు.

ప్రకాశం "తినగూడని వస్తువునుగురించి పాఠమేమిటి?" అన్నట్టు సముద్రపువారకుపోయి గవ్వలు, నత్తగుల్లలు రంగు రంగులివి ఏరికొంటూ "నాన్నగారోయ్! ఇక్కడంతకంటే పెద్ద వడగ వుందండోయ్!" అన్నాడు. తండ్రి "ఒరేవ్! ఈమాటు దాన్ని వడగ అన్నావా తన్నేస్తాను. తిన్నావా వొళ్ళు చీరేస్తాను. ఇల్లారా! ఇటుచూడు!" అన్నాడు.

ప్రకాశం "కెరటాలు నాన్నగారూ! ఎలా వున్నాయో! ఎంత ఎత్తు ఎగురుతున్నాయో!" అన్నాడు. "అయితే ఏమం టావు?" "ఇక్కడ ఉండిపోదాం. ఇంటికి వెళ్ళొద్దు మనం. మీరు వెళ్ళినా నేనురాను. చూడండి నాన్నగారూ! నాకాళ్లక్రింద కీ కెరటం ఎంతపెద్ద వడగను పడేసిందో వొడ్డుకు! చేటంతవుంది! దీన్ని మనింటికి మోసుకుపోదాం అండీ నాన్నగారూ!" తండ్రి "అది వడగకాదని ఎన్నిమాట్లు చెప్పను?" ప్రకాశం "వడగెందు క్కాదు? చేటంత వడగలుండవు? మొన్న మన పెరట్లో రుబ్బు రోలు పాత్రమంత వడగ పడింది. నేనూ అక్కా కలిసి చిత కొట్టినా చితకందే?" తండ్రి "చితక్కపోతే ఏంచేశారూ?" ప్రకాశం "అలాచూస్తూవుంటే కరిగిపోయింది. నీళ్లు అయి వూరు కుంది. తండ్రి "ఇది?" ప్రకాశం "అలా కరగడంలేదండీ! తన్నినా తాకినా వొకలాగేవుందండీ!" అని అన్నాడు. తండ్రి

"తన్నకు అదో జీవము. ఇంగ్లీషులో "జెల్లీఫిష్" అని అంటారు. ప్రకాశం "తెనుగులో?" తండ్రి "జిల్లిక"

ప్రకాశం "జీవము అయితే కళ్ళు, ముక్కు, కాళ్ళు, కడుపు ఏవీ?" అని అడిగాడు. తండ్రి "దీనికవేమీ ఉండవు" ప్రకాశం "అంచేతే అంత మెత్తగావుంది" అన్నాడు. ప్రకాశం మాట తండ్రి కర్ధంగాక "ఎంచేత?" అని అడిగాడు. ప్రకాశం "ఆవేంవుండక సర్వం ఒక్క గుబగుబ కొట్టుకునే గుండెకాయే కాబట్టి ఇదంత మెత్తగావుంది" అంటూ పరిశీలించాడు. "కొట్టుకునే గుండికాయ ఎవరికీ చెందకుండా వుండనేరదు" అని లోలోన యోచిస్తూ తండ్రి "ఇంతకాలానకు కనుక్కొన్నానురా నీద్వారా సముద్రునియొక్క గుండెకాయ! నిజంగా ఎంత మెత్తగా వుందీ!" అని ముట్టుకు చూచాడు. కొడుకు నిర్భయంగా దాన్ని ముట్టుకుచూస్తూ "కాని ఇది కరగదండీ! దేవునిగుండె కరిగినట్టు కరగదండీ! ఇది!" అన్నాడు. తండ్రి "దేవునిగుండె అంటే" అని అడిగాడు. ప్రకాశం "ఆకాశంనుంచి పడే వడగండీ! ఆమాత్రం మీకు తెలియదండీ! అది కరిగినట్టు మరేమీ కరగవండీ! మీకు తెలియదండీ?" అని ఆకాశంవంక తన కనులు చెమ్మగిలేటట్టు చూచాడు.

... ... ... ... ...

## హడావిడి బజారే

ఇది నిజంగా జరిగిన సంగతే; కాని పాఠకులు దీన్ని ఒక వార్తగా అందుకుంటే బాగుంటుందని అభిప్రాయం. ఒకవేళ అలా తీసుకోవడానికి వాళ్లకిష్టముండదూ కథగా చదివి ఆనందించవచ్చును. అరే! అప్పుడే నిజం కల్లగా మారిపోయెనే!

నేను ఒక రోజున రాజమార్గాన్ని కాలినడకను వెడుతున్నా! సర్వసాధారణంగా అలాగే చేస్తూంటాను. ఒకటి సిటీబస్సుమీద